

# పాపం రామనాథం

ఎం. వెంకటేశ్వరరావు

"ఏమండీ!—"

ఆఫీసుకు వెళ్ళబోతున్న మూర్తి వీధి గుమ్మంలో ఆగి వెనక్కు తిరిగి చూశాడు.

"ఓ అయిదు రూపాయలు కావాలి—" అని అడిగిన రాధ ముఖంలోకి యెందుకన్నట్టుగా ప్రశ్నార్ధకంగా చూశాడు.

"కావాలి!—" ముసి ముసిగా నవ్వింది. తనూ నవ్వాడు మూర్తి. ఒక్క క్షణ కాలంపాటు వారిపెదాలపై చిరునవ్వు తొణికిసలాడింది.

"ఇంట్లోకి కావలసినవి అవసరమైతే నేనే తెస్తాను. మరి నీకు డబ్బుతో పనేముంది? అడగ్గానే ఇవ్వటానికైనా ఇవాళ తారీఖు ఇరవై యెనిమిది—" అంటూ గుమ్మం దాటాడు మూర్తి.

పక్క వాటాలో అద్దెకున్న — శేఖరంగారి భార్య — రాజ్యం యెదురు పడింది. రాధకోసం వెడుతున్నదని మనసులో అనుకుంటూ మెల్ల దగ్గర ప్రక్కగా తప్పుకొని దారి విచ్చాడు.

చటుక్కున ఏదో జ్ఞాపకానికి వచ్చిన వాడిలా వెనక్కు తిరిగి, అంతవరకు గుమ్మంలో నిలబడ్డ రాధతో "అంతగా అవసరమైతే సాయంకాలం వచ్చిన తర్వాత ఇస్తాను.... అదైనా ఎందుకో చెప్పాలి—" అని అన్నాడు.

"సార్! అయ్యగారు రమ్మంటున్నారు—" అన్న ప్యూన్ పుల్లారావు మాటలకు అంతవరకు కథ చదవడంలో నిమగ్నుడైన రామనాథం వీక్లీని పక్కన పడేసి "ఇపుడేగా ఆయన దగ్గర్నుంచి వచ్చింది. ఈ లంచ్ టైంలో కూడా ఏమంత అర్జంటొచ్చింది?" అని విసుక్కుంటూ లేచాడు.

ఆ ధోరణికి పుల్లారావాశ్చర్య పోయాడు. ఆయన అలా కబురంపగానే మరుక్షణంలో ఈయన ఆయన ముందు చేతులు కట్టుకొని ప్రత్యక్షం కావడం పరిపాటే! ఒక్కొక్కసారి అరగంటకు లోపుగా ఆఫీసర్ రూమ్‌లోనుంచి బయటకు వచ్చేవాడు కాదు. అంతవరకు బస్సులో ప్రయాణం చేసే స్టాండింగ్ ప్యాసింజెర్‌లా నిలబడే వుండేవాడు. వెడుతున్న బస్సు మధ్యలో బ్రేకు పడినప్పుడల్లా వెనక్కు ముందుకు ఊగులాడే స్థితినికూడా ఆ గదిలో వున్నంతసేపు - ఆఫీసరు ముందున్న ఫైల్సులోకి తొంగిచూస్తూ కొంతసేపు, నిలబడి కొంతసేపు — అనుభవించేవాడు. ఇంతవరకు ఒక్కసారైనా రామనాథం నిరసన భావం ప్రకటించగా ఎవరూ చూడలేదు. అటువంటి రామనాథం అలా విసుక్కోవటం పుల్లారావుకు నిజంగా ఆశ్చర్యమేసింది.

మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంటూ "ఆఁ ఏమీలేదు. వడ్లగింజలో బియ్యపు గింజ. రేపు పబ్లిక్ హాలీడే గనుక ఆఫీసు శెలవని నోటు పంపించమన్నారు—" అని అన్నాడు; వీక్లీని అందుకున్నాడు.

ఇంతకు ముందు రామనాథం విసుక్కున్నందుకు కారణం 'ఇదాఅన్నట్లు' వీక్లీవైపు చూసి వెళ్ళిపోయాడు ప్యూన్.

చదివిందే చదివి మధ్య మధ్యలో ఆలోచిస్తూ పది నిముషాల్లో కథ చదవడం పూర్తిచేశాడు. రచయిత పేరు చూశాడు. 'రమణి' అని వుంది. ఆ పేరుతో ఇంతకు ముందెక్కడా ఏ రచనా ప్రచురించినట్లుగా చూడలేదు. కథలో వ్యక్తులు మూర్తి, రాధ, రాజ్యం.

కథలోని సంఘటనలన్నీ తన స్వానుభవం లోనివి : మూర్తి పాత్ర తనకు ప్రతిబింబం.

కథానాయిక రాధ మాదిరిగానే తనను రాజ్యలక్ష్మి అయిదు రూపాయలు అడిగింది. ఎందుకు కావాలో చెపితేగాని ఇవ్వనని తను వెళ్ళిపోయాడు. ఆనాడే ఆఫీసుకు విశ్వ

నాథంగారి భార్య - ఆయన ఊళ్ళో లేక పోవటంవల్ల - అర్జంటుగా కావాలని పది రూపాయలకు కుర్రాణ్ణి పంపించింది. తనకూ ఆయనవల్ల అటువంటి అవసరాలు వస్తూంటాయి గనుక అడిగిందే తడవుగా ఇచ్చి పంపించాడు. ఆ సాయంత్రం ఆఫీసు నుండి తను ఇంటికి వెళ్ళేసరికి మీ రిచ్చిన పది పంపించారంటూ రాజ్యలక్ష్మి తనకు ఇచ్చింది. తను అడగానే నెల చివరని. ఎందుక్కావాలో చెప్పమన్న వారికి అప్పుగా ఇవ్వటానికి ఎక్కడిది నుంచి వచ్చిందని రాజ్యలక్ష్మి అడిగింది.

కథలో మూర్తి ఆదర్శవాదిగా చిత్రించబడ్డాడు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చి అనేక వ్యాసాలు వ్రాసిన అభ్యుదయ మూర్తి. కాని తనలో ఆ గుణాలేవీ లేవు. కథలు కల్పితాలే కావచ్చును. ఆ కల్పనకు ఆధారమంటూ యేదో ఒక బలవత్తర సంఘటన వుంటుంది. ఆ సంఘటనల్లోని ఒక అంశానికి జీవంపోసి మెరుగులుదిద్ది కథగా అల్లుకుపోతారు.

ఈ కథ తనను గురించి. తనా విధంగా అనుకోవటానికి వీల్లేదన్నట్టుగా కథారంభములోనే ఇందలి పాత్రలు - సంఘటనలు కేవలము కల్పితములు అని ఆ రచయిత 'రమణి' ముందుగానే వ్రాయటం జరిగింది. అంత నిర్భయంగా తనను పత్రికలో యెక్కించిన రచయిత ఎవరా అని యెంతగా ఆలోచించినా అంతు చిక్కలేదు.

అప్రయత్నంగా వెంకట్రావు స్మృతి పథంలో మెదిలాడు. తనున్న ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఆనాడు— విశ్వనాథంగారి భార్య కుర్రాణ్ణి పంపినప్పుడు — వెంకట్రావు కూడా అక్కడే వున్నాడు. మైగాడ్! అప్పుడే కథగా రాశాడా? అతనే వ్రాస్తే తన ఇంట్లో జరిగినవి జరిగినట్లుగా యెలా ఊహించి వ్రాయగల్గాడు?

సంతృప్తినిచ్చే సమాధానం దొరకలేదు. ఆలోచన అన్నిటిని కట్టిపెట్టి ఫైల్ ముందేసుకున్నాడు రామనాథం.


సాయంత్రం ఐదయింది! ఆఫీసులో బయలుదేరి సిటీబస్సు యెక్కాడు. అణగారిపోయిన ఆలోచనలు ఒక్కసారిగా రామనాథం మస్తిష్కంలో అటు - ఇటు పరుగెత్తాయి.

"వెంకట్రావే వ్రాసివుంటే ఎప్పుడూలేని 'రమణి' అన్న కలం పేరు పెట్టుకోవాల్సిన అగత్యం తన వల్లనేనా?"

ఈ భావం మనసుకు తాకగానే శరీరం ఆవేశంతో గగుర్పొడిచింది. పళ్ళు బిగపట్టి బరువుగా నిట్టూర్చాడు.

"ఫూల్—" అప్రయత్నంగా పెదవులు విడివడ్డాయి. ప్రక్కన కూర్చున్న వ్యక్తి విన్నాదేమోనన్నది అనుమానం మాత్రమేనని అతని ముఖం పరిశీలనగా చూసి నిర్ధారణ చేసుకున్నాడు.

బస్సు ఆగింది. దిగి ఇంటి ముఖం



పట్టాడు. ఎదురుగా తనే కథనుగురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడో ఆ వీక్లీ టేబుల్‌పై కనుపించింది.

భోజనం చేస్తూండగానే రాజ్యలక్ష్మి అడిగింది. 'అయిదు రూపాయల కథ చదివారా?'

మంచినీటి గ్లాసు అందుకొని పెదాల దగ్గరగా తీసుకుంటూ కళ్ళ

తోనే — చదివానన్నట్లుగా — సమాధానం చెప్పాడు.

"ఆ మూర్తి ఆశయాలు, ఆదర్శాలు ఒకరికి చెప్పేటంతవరకేగాని తను ఆచరించడంలో యెటువంటి అభిప్రాయం వున్నదో భార్య రాధ అయిదు రూపాయలు అడగానే తెలిపోయింది. చివరకు ఆమె అడిగింది కూడా అతగాడు ముచ్చటపడిన గాజు బొమ్మలు కొనటానికే! ఎగ్జిబిషన్‌లో వాటిని చూశాడు. పదే పదే మెచ్చుకున్నాడు. కొనమంటే అనవసరం, డబ్బు దండుగ అన్నాడు కాని వాటి పనితనాన్ని గురించి ఇంట్లో మళ్ళీ మెచ్చుకోకుండా మానలేదు. రాధ కొని ఇంట్లో అలంకరించగానే చూసి సంతృప్తిపడ్డాడు. ఆగ్రహపడలేదు. అతడు అనుకొన్నది, మనసు పడినది ఆమె ఆచరణలో పెట్టింది. చూశారా వారి మనస్తత్వాలు."

"అఘోరించినట్లే వుంది నీవాదం."

అంటూ భోజనం పూర్తిచేసి లేచాడు.

"రాజ్యలక్ష్మికి కూడా ఆ కథ నచ్చింది. దీనికంతకూ ఆ వెంకట్రావే మూలం —" అనుకున్నాడు.

అతని ఆలోచనల్లో పక్కగా వచ్చి కూర్చున్న రాజ్యలక్ష్మిని గమనించలేదు. మృదువైన వేళ్ళతో తాకేంతవరకు ఆలోచనల్లో నుంచి తేరుకోలేదు.

"అది కథ కాదు. మన ఇంటో సంఘటనే. నిదానంగా ఆలోచిస్తే నీకే తెలిసేది. ఆ తెలివి నీకెక్కడ వుంది? చదివి బాగున్నదని సంతోషించావే గాని మనల్ని పత్రికలో ఎక్కించాడన్న ధ్యాస లేదా? అది వ్రాసిందెవరో కూడా గ్రహించాను!—"

ఫక్కున నవ్వింది రాజ్యలక్ష్మి.

"అదా మీ ఆలోచన! నేను మీకన్నా ముందుగానే గ్రహించాను. కాని ఆ కథ మన ఇంట్లో జరిగిన సంఘటనకన్నా ముందుగా వ్రాసి పంపించారు—"

రామనాధం ఆశ్చర్యపోయాడు. సందేహ నివృత్తి కాలేదు.

"అంతా అబద్ధం! జరుగనిది ముందుగా ఊహించుకు వ్రాసిందని చెపితే నమ్మేటంత స్థితి పట్టాలంటే మన ఇంట్లో జరుగకుండా ఉండాల్సింది! నువ్వన్నట్లు గాకుండా కథ తర్వాత వ్రాసి పంపించారని ప్రూవ్ చేస్తాను, కలంపేరు పెట్టుకున్న రచయిత ఎవరో కూడా చెపుతాను."

"ఎవరో ఆ పేరు చెప్పండి! రైటైతే మీ రన్నట్టుగానే మన ఇంట్లో సంఘటనే ఆధారంగా తీసుకొని కథ వ్రాశారని ఒప్పుకుంటా—"

నిగూఢ రహస్యాన్ని భేదించిన డిటెక్టివ్‌లా ఫీలవుతూ, ద్విగుణీకృతోత్సాహంతో రామనాధం అడిగాడు:

"మీ ఫ్రండ్ కమలమ్మ (విశ్వనాధంగారి భార్య) మా ఆఫీసులో పని చేస్తున్న వెంకట్రావుకు దూరపుబంధువు అని ఒకసారెపుడో చెప్పినట్లున్నావు కదూ?—"

రాజ్యలక్ష్మి ముఖంలోకి సూటిగా చూశాడు. వెన్నెల వెలుగుల్లో ఆమె కళ్ళల్లో తన అపజయాన్ని గుర్తించి నట్లుగా పసికట్టాడు. ఆమె పెదవులు దాటి రావలసిన మూడు అక్షరాల కోసం పెదాలవైపు చూశాడు. ఆమె పెదాలు విడివడ్డాయి.

"అ - వు - ను !—"

గగన కుసుమాన్ని సాధించినంత ఉత్సాహంతో పడుకున్నవాడల్లా ఒక్కసారిగా లేచాడు.

"అదీ అసలు రహస్యం ! కథలు రాయటం వచ్చినంత మాత్రాన సాటి గుమాస్తానన్న సానుభూతైనా లేకుండా విభూతి రాద్దామనుకున్నాడు. ఇడియెట్! ఏదైనా ఫైల్స్‌లో ఇరికిస్తే వాడి దొక్క చీలుతుంది. మజా తెలుస్తుంది."

ఆతని ఆవేశానికి అడ్డేసింది. టక్కున ఆగిపోయాడు. తను ఓడిపోయాడు. పకపక నవ్వుతున్న రాజ్యలక్ష్మి మాటలు చెవుల్లో గింగుర్లెత్తించాయ్ !

"మీ ఊహ సరికాదండోయ్ ! పాపం, ఆ వెంకట్రావుగారిని అనవసరంగా నిందిస్తున్నారు—"

రామనాథం అడక్కుండానే అసలు రహస్యం బైట పెట్టింది రాజ్యలక్ష్మి.

"ఆ కథ రాసిన తర్వాత ఆమె నాకు చూపించి యెలా వున్నదని అడిగారు. బాగానే వున్నది కాని అందులో మాదిరిగా భార్య అడగ్గానే అలా కాదనటం ఏమంత నచ్చలేదు. ఆ అభిప్రాయమే వ్యక్తపరచాను. కాని కొందరి తీరే అంత: నేను చాలా మందిని చూశా నన్న విధంగా ఆమె ఇచ్చిన సమాధానం నాకు పూరట కలించలేదు. ఆ కథలో మాదిరిగా మిమ్మల్ని అడిగాను. లేదన్నారు. మీ దగ్గర నిజంగా లేక ఇవ్వలేదో, నెల చివర అందులో నేను అనవసరంగా ఖర్చుపెడతానని ఇవ్వలేదో నిర్ధారణ చేసుకోవాలని కమలమ్మగారి అబ్బాయిని వారి ఇంట్లో అడిగారని చెప్పి పది రూపాయలు మీ దగ్గర్నుండి తెప్పించుకున్నాను. ఆ కథ వ్రాసింది కమల—"

పాపం, రామనాథంపచ్చివెలక్కాయ గొంతున పడ్డట్టు, ఒక క్షణకాలంపాటు గుటకలు మింగి "చివరకు మీ రిద్దరూ నామీద ట్రయిల్ వేశారన్నమాట!—" అన్నాడు.

***

## చందా దారులకు మనవి

"జ్యోతి" చందాదారులకు నవంబరు సంచిక మామూలుగానే అందుతుంది. దీపావళి ప్రత్యేక సంచికను వారు విడిగా తెప్పించుకోవలసి వుంటుంది. రిజిస్టర్డ్ పోస్టులో తెప్పించుకోగోరేవారు ప్రత్యేక సంచిక వెల (రూ. 4) తో పాటు అరవై పైసలు పోస్టేజి ఖర్చు అదనంగా పంపాలి.

మేనేజరు, జ్యోతి.